www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 20 జులై 2025

5

తిరుపతి

ఆగస్టు 19 వరకూ శ్రీవారి పుష్కరిణి మరమ్మతులు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయం పక్కన గల పవిత్రమైన స్వామి పుష్కరిణి మరమ్మతు పనులు జూలై 20 నుండి ఆగస్టు 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఏడాదీ పుష్కరిణి మరమ్మతులు నిర్వహిస్తారు. ఈ ఏడాది సెప్టెంబరు 24 నుండి శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో టీటీడీ వాటర్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో నెల రోజుల ముందుగానే ఈ పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. ఈ నెల రోజుల పాటు భక్తులను పుష్కరిణిలోకి అనుమతించరు. ఈ విషయాన్ని దష్టిలో పెట్టుకొని సహకరించాల్సిందిగా భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది .

'స్వచ్ఛాంధ్ర'తోనే 'స్వర్ణాంధ్ర'

పారిశుధ్య కార్మికులే సమాజ సేవకులు / 'ప్రజావేదిక' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్

'స్వర్ణాంధ్ర కావాలంటే స్వచ్ఛాంధ్రను సాధించాలి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఇల్లు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య కార్మికులే నిజమైన సమాజ సేవకులని, కేన్సర్ కారకం ప్లాస్టిక్ మాత్రమేనని, దశలవారీగా వాడకాన్ని తగిస్తామని అన్నారు. మూడో శనివారం 'స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా తిరుపతికి విచ్చేసిన చంద్రబాబు అలిపిరిలో కంచిమఠం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై, ఎంఆర్‌పల్లిలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రజావేదిక బహిరంగసభలో మాట్లాడారు. తొలుత తూకివాకంలోని సమీకృత వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలించానని, అనంతరం కపిలతీర్థంలో కపిలేశ్వర స్వామిని దర్శించుకుని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానని అన్నారు.

రాష్ట్రం అంతా పరిశుభ్రంగా ఉండాలనే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మూడో శనివారం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు పాఠశాలను, పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. చెట్లు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎక్కడ చెత్త కనిపించినా దాన్ని తీసుకెళ్లి చెత్తబుట్టలో వేయగలిగితే పరిసరాలు శుభ్రంగా ఉంటాయన్నారు. పారిశుధ్య కార్మికులే నిజమైన సమాజ సేవకులని వారిని అభినందించారు. ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేయాలని, లేదంటే కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్ర సచివాలయంలోనూ, అక్టోబర్ 2 నాటికి 17 కార్పొరేషన్లలోనూ ప్లాస్టిక్ లేకుండా చూస్తాం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తామన్నారు. తిరుపతి లాంటి అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తిరుపతి భారతదేశానికే ఆదర్శం కావాలన్నారు. బాధ్యతగల పౌరులు రోడ్లపై చెత్త వేయరాదని విజ్ఞప్తి చేశారు. 123 మున్సిపాలిటీల నుంచి 9వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని, తడిచెత్త 5,500 మెట్రిక్ టన్నులు, పొడిచెత్త 3,500 మెట్రిక్ టన్నులు వస్తోందన్నారు. గత ప్రభుత్వం 86 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రోడ్డుపై వదిలేసి వెళ్లిందని, అక్టోబర్ 2 నాటికి గత ప్రభుత్వం వదిలేసి వెళ్లిన చెత్తనూ తొలగిస్తామన్నారు. ఇటీవల వచ్చిన 20 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తనూ డిసెంబర్ నాటికి తొలగించి రోడ్డుపై చెత్త లేకుండా చూస్తామన్నారు. త్వరలోనే ప్రాజెక్టులను పూర్తిచేసి హంద్రీనీవా నీటిని వెంకన్న చెంతకు తీసుకొస్తామన్నారు. మల్లెమడుగు, సోమశిల, స్వర్ణముఖి లింక్ కెనాల్ తీసుకొచ్చి బాలాజీ రిజర్వాయర్‌కు కలుపుతాం. వీటిమధ్యలో వేణుగోపాల సాగర్ వస్తుంది. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి తాను పుట్టిన చిత్తూరు జిల్లా రుణం తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్లు, జేసి శుభం బన్సల్,ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు.

తూకివాకంలో వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రం పరిశీలన

కంచిమఠం స్వామితో చంద్రబాబు

చంద్రబాబుకు సాదర స్వాగతం, వీడ్కోలు

రేణిగుంట : తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం శనివారం ఉదయం 11.42 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, సిఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, డిఐజి షిమోషి బాచ్‌పాయ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఎంఎల్ఎలు ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలం, నెలవల విజయశ్రీ, పాశం సునీల్‌కుమార్, భానుప్రకాష్, కె.రామకృష్ణ, పి.మురళి, థామస్, కార్పొరేషన్ ఛైర్మన్లు పసుపులేటి హరిప్రసాద్, సుగుణమ్మ, నరసింహయాదవ్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి స్వాగతం పలికారు. సాయంత్రం 6.45 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు.

సిఎం దృష్టికి యుడిఎస్ సమస్య

తిరుపతి నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పాడైపోయి అధ్వానంగా ఉందని, దాన్ని బాగు చేసేందుకు నిధులు ఇవ్వాలని 'ప్రజాశక్తి'లో శనివారం వార్త ప్రచురితం అయ్యింది. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి ఇదే విషయాన్ని తీసుకెళ్లారు. శనివారం మధ్యాహ్నం స్వర్ణాంధ్ర స్వచంధ్ర కార్యక్రమంలో భాగంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు తిరుపతి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చిన్నపాటి వర్షానికి తిరుపతి నగరం మునిగిపోతుందని, దాన్ని బాగు చేసేందుకు తగినంత నిధులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. సిఎం స్పందిస్తూ తిరుపతి స్మార్ట్ సిటీ పథకం ముగిసిపోవడం వల్ల చాలా ప్రాజెక్టులు పూర్తి అవ్వాల్సి ఉందని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కూడా వివిధ పథకాల ద్వారా నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

పారిశుధ్య కార్మికులను సన్మానించిన సీఎం

స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో ఈ నెల 17వ తేదీ జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా తిరుపతి కార్పొరేషన్ అవార్డును దక్కించుకుంది. శనివారం తిరుపతికి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ కార్మికులతో పాటు శానిటరీ సూపర్వైజర్ చెంచయ్య, సుమతి తో పాటు పరిశుద్ధ కార్మికులకు శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మౌర్యతో పాటు, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, కలెక్టర్ వెంకటేశ్వర్లు, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు ఉన్నారు.

కందకాలు తవ్వి సోలార్ ఫెన్సింగ్ వేయండి

ప్రజాశక్తి - రామచంద్రాపురం

అటవీ సమీప ప్రాంతాల గ్రామాల్లోని పంట పొలాలపై గజరాజుల దాడి నుంచి రైతులను కాపాడాలని, కందకాలు తవ్వి, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని చంద్రగిరి జనసేన ఇన్‌ఛార్జి దేవర మనోహర్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి పర్యటనకు విచ్చేసిన సిఎంను కలిసి ఏనుగులు తరచూ పంట పొలాల్లో చొరబడి పంట నష్టమే కాకుండా, రైతులపై దాడులు చేసి చంపేస్తున్నాయని వాపోయారు. సిఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పారిశుధ్య కార్మికులే సమాజ సేవకులు అని తిరుపతి పర్యటనలో చెప్పిన చంద్రబాబు వారి సమ్మె కాలపు హామీలు గాలికొదిలేయడంతో సూళ్లూరుపేటలో నిరసన

సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలివ్వాలి

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసనలు

ప్రజాశక్తి - నాయుడుపేట, సూళ్లూరుపేట

ఇంజినీరింగ్ కార్మికులకు సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలివ్వాలి' అంటూ నాయుడుపేట పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య, సిఐటియు కార్యదర్శి శివకవి ముకుంద మాట్లాడుతూ గత ఏడు రోజులుగా సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తుంటూ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. ఇంతటి నిర్లక్ష్యం పాలకులకు తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులందరికీ వినతిపత్రాలు ఇచ్చే, అనివార్య పరిస్థితుల్లో సమ్మెలోకి వెల్లాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీనయ్య, నాగరాజు, రామచంద్రయ్య,కాలేషా, వీరాస్వామి, రవి, సురేష్, ఇషాద్, మునిరాజా, కృష్ణ పాల్గొన్నారు.

– సూళ్లూరుపేటలో మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరంలో కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకుని, మోకాళ్లపై నిల్చుని వినూత్నంగా నిరసన తెలిపారు. సూళ్లూరుపేట పట్టణ నాయకులు ఎస్‌కె రియాజ్ మాట్లాడుతూ కార్మికుల సహయాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల జీతభత్యాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్‌కె ఫయాజ్, నాయకులు వెంకటరత్నం, రామయ్య, చిన్నయ్య, మురళి, కరీం, బాబు పాల్గొన్నారు.

విలీనం వద్దంటూ ముళ్లకంచెతో నిరసన

హాజరు, మధ్యాహ్న భోజనం ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - ఏర్పేడు

ముళ్లకంచె వేసి, బడికి బీగం వేసి నిరసన

'మా ఊరి విద్యార్థులు మా ఊరి బడిలోనే కొనసాగించాలి' అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు బడికి తాళాలు వేసి ముళ్ళ కంచెను వేసి నిరసన తెలిపిన ఘటన ఏర్పేడు మండలంలోని పల్లాం పేట దళితవాడలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే బడుల విలీనం అంటూ పల్లంపేట దళితవాడ ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులు విద్యార్థులను పల్లం దళితవాడ పాఠశాలలో విలీనం చేస్తున్నారని, కిలోమీటర్ల మేర భద్రత లేని రోడ్లమీద పిల్లల్ని పంపలేమని గత నెల 25న సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పేడు –వెంకటగిరి ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. దీంతో ఉన్నతాధికారులు స్పందించి ఆందోళనలు తీవ్రంగా ఉన్నచోట మినహాయిస్తామని హామీ ఇచ్చారు. అప్పటినుండి పల్లంపేట బడికే విద్యార్థులు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారుల మొండి వైఖరితో విద్యార్థులకు హాజరు, మధ్యాహ్న భోజనం అందజేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ శనివారం ఉదయం బడికి తాళాలు వేసి, ముళ్ళ కంచును ఏర్పాటు చేశారు. మా ఊరి బడికే మా పిల్లలు పోతారని, బయట బడికి పోరని నినాదాలు చేశారు. విద్యాశాఖ అధికారుల మొండి వైఖరి నశించి విద్యార్థులకు హాజరు, మధ్యాహ్న భోజనం అందజేస్తూ బడిని పున్ణ ప్రారంభించాలని కోరుతున్నారు.

ఏరియా ఆసుపత్రికి భద్రత ఏదీ..?

× ఆసుపత్రిపై తరచూ దాడులు ✓ కలగానే పోలీస్ 'అవుట్ పోస్ట్'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యుల భద్రతే ప్రశ్నార్థకంగా మారుతోంది. దాడులు, అఘాయిత్యాలు వంటి దారుణాలు జరిగినప్పుడు హడావిడి చేయడం మినహా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు కరువవుతున్నాయి. తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాలకు పెద్ద దిక్కుగా ఉంటూ పెద్దాస్పత్రిగా పేరొందిన శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది భద్రత తీవ్ర చర్చనీయాంశమవుతోంది. వైద్యం కోసం నిత్యం వచ్చే వందలమంది రోగులు, వారి బంధువులతో పాటు ఆసుపత్రుల్లోని సిబ్బంది, వైద్యులు ఉండేచోట భద్రతా వైఫల్యాలెన్నో వెలుగు చూస్తున్నాయి. ఆసుపత్రి పరిసరాల్లో జులాయిగా తిరుగుతున్న యువకులు గంజాయి, మద్యం సేవించి గొడవలకి దిగి, గాయాలపాలై నిత్యం ఆసుపత్రికి వస్తుండడంతో వారికి చికిత్స అందించడం సిబ్బందికి దుర్లభంగా మారుతోంది. ఈ క్రమంలో వారు వైద్యులు, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఫలితంగా వైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోంది.

ఆసుపత్రిపై తరచూ దాడులు

స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఓ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ కింద 19 మంది సిబ్బంది పని చేస్తున్నారు. అయితే వీరంతా మూడు షిఫ్ట్ లలో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్నారు. పేరుకే సెక్యూరిటీ కానీ, వీరందరినీ పారిశుధ్యం తదితర సెక్యూరిటీయేతర పనులకు వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో భద్రతా వ్యవస్థ లోప భూయిష్టంగా మారింది. ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి ఆసుపత్రి అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న యువకులపై మద్యం, గంజాయి సేవించిన కొంతమంది యువకులు మారణాయుధాలతో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. అదేవిధంగా గతేడాది ఆగస్టు నెలలో గ్యాంగ్ వార్ జరిగి గాయపడ్డ వారు ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆ క్రమంలో రెండు గ్రూపులు ఆసుపత్రిలోనే మారణాయుధాలతో దాడి చేసుకున్నారు. ఇలాంటి ఘటనలతో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది బెంబేలెత్తిపోతున్న పరిస్థితి.

కలగానే పోలీస్ 'అవుట్ పోస్ట్'

ఆసుపత్రిలో ఉన్న మరుగు ప్రదేశాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. రోగుల బంధువుల్లా వచ్చి పలువురు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఓ మహిళా రోగిపై రోగి బంధువు లైంగిక దాడి చేసే ప్రయత్నం గతంలో జరిగింది. అదేవిధంగా మహిళా రోగిపై ఆసుపత్రి సిబ్బంది ఒకరు లైంగిక దాడి చేసే ప్రయత్నం కూడా గతంలో జరిగింది. అదేవిధంగా ఆసుపత్రిలో విలువైన సామగ్రి గతంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వీటన్నిటి దష్ట్యా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి ఓ పోలీసు ఔట్ పోస్టును కేటాయించాలన్న ప్రతిపాదన ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైంది.

ప్రతిపాదనలు పంపాం : డాక్టర్ మణి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

ఏరియా ఆసుపత్రి చుట్టూ ప్రమాదకర పరిస్థితులు ఉంటున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయం వెంటాడుతోంది. పోలీసు అవుట్ పోస్ట్ కోసం ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం.

తిరుపతిలో దంచి కొట్టిన వాన

చెరువులను తలపించిన రోడ్లు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో శనివారం మధ్యాహ్నం వర్షం దంచి కొట్టింది. మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం 4:30 వరకు వర్షం కురవడంతో నగరంలో పలు రోడ్లు చెరువులను తలపించాయి. స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు తిరుపతికి విచ్చేశారు. ఆయన తిరుపతి పర్యటనలో ఉన్న సమయంలోనే వర్షం దంచి కొట్టడంతో నగరంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.. భూగర్భ డ్రైనేజీలు పొంగి ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలైన మధుర నగర్, సప్తగిరి నగర్, ఎర్రమిట్ట, శివ జ్యోతి నగర్ వంటి ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు రావడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. సీఎం చంద్రబాబు నాయుడు సైతం పలు

కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వర్షంలో గొడుగు పట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. వర్షం వల్ల డిఆర్ మహల్ అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు ఉధతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెస్ట్ చర్చి వద్ద కూడా ఉధతంగా వర్షం నీరు రావడం వల్ల సుమారు రెండు గంటల సేపు అక్కడ రాకపోకలు ఆపేశారు. లక్ష్మీపురం సర్కిల్ వద్ద వర్షపు నీరు ఉధతంగా రావడంతో వాహనాలు వెళ్ళకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం వేరే మార్గంలో కపిలేశ్వర స్వామి దర్శనానికి వెళ్లారు. అలాగే ఉపాధ్యాయ నగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో కూడా వర్షపు నీరు ఉధతంగా రావడంతో ఎక్కడి రాకపోకలు అక్కడే నిలిచిపోయాయి. ముఖ్యంగా రేణిగుంట–తిరుపతి మార్గంలో రోడ్డుపైన వర్షం నీరు నిలిచిపోవడం వల్ల వాహనదారులు అవస్థలు వర్ణనాతీతంగా మారింది. మూడు రోజుల నుంచి తిరుపతి నగరంలో వర్షాలు కురుస్తుండడంతో మురుగు కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టినప్పటికీ అవి వర్షంలో మళ్లీ కొట్టుకుపోయాయి. దీనివల్ల మళ్లీ అదనపు పని కాంట్రాక్టర్ల పై పడింది.

నలుగురు హిందూయేతర ఉద్యోగులు సస్పెండ్ : టిటిడి

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తూ సంస్థ ప్రవర్తనా నియమావళిని పాటించలేదని భావించడమే గాకుండా, హిందూ ధార్మిక సంస్థకు ప్రాతినిధ్యం వహించే ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తూ బాధ్యతారహితంగా వ్యవహరించారన్న కారణాలతో నలుగురు హిందూయేతరులను సస్పెండ్ చేసినట్లు టిటిడి ఓ ప్రకటనలో పేర్కొంది. బి.ఎలిజర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (క్వాలిటీ కంట్రోల్), ఎస్. రోసి, (స్టాప్ నర్స్, బర్డ్ ఆసుపత్రి), ఎం.ప్రేమావతి (గ్రేడ్ –1 ఫార్మసిస్ట్ , బర్డ్ ఆసుపత్రి), అదేవిధంగా డా.జి.అసుంత. (ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీ)లను సస్పెండ్ చేసింది. ఈ నలుగురు ఉద్యోగులు క్రిష్టియన్ మతాన్ని అనుసరిస్తున్నారని, అందుకు సంబంధించిన ఆధారాలు, వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేసినట్లు పేర్కొంది. నిబంధనల ప్రకారమే శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.

తిరుపతి డిఎస్‌పిగా వెంకటనారాయణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి ఈస్ట్ డిఎస్‌పిగా జె.వెంకటనారాయణకు మళ్లీపోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆర్నెళ్ల క్రితం తిరుపతి ఈస్టు డిఎస్‌పిగా పనిచేసిన వెంకట నారాయణను వైకుంఠ ఏకాదశి తొక్కిసలాట నేపథ్యంలో ఆయనపై బదిలీ వేటు పడింది. విజయవాడ డిజిపి కార్యాలయంలో డిఎస్‌పిగా వెయిటింగ్‌లో ఉన్న ఆయనను తిరిగి తిరుపతి ఈస్ట్ డిఎస్‌పిగా నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా 61 మంది సిఐలకు ఉద్యోగోన్నతి కల్పించారు. ఇందులో భాగంగా రాజగోపాల్‌రెడ్డిని తిరుపతి పోలీసు కళాశాలకు డిఎస్‌పిగా, శ్రీలతను వెస్ట్ పోలీసు స్టేషన్ డిఎస్‌పిగా, ఎస్ఆర్‌సి హర్షితను డిఎస్‌పి తిరుపతిగా నియమించారు. మరో పిటిసి డిఎస్‌పిగా షానూ షేక్‌ను నియమించారు.

రైల్వేయార్డుల్లో నిఘా ఉంచాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'తిరుపతి రైల్వే యార్డులో జరిగినటువంటి అగ్ని ప్రమాదాలు ఇకపై జరగకుండా, ఆర్‌పిఎఫ్ సిబ్బంది నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది' అని డివిజనల్ రైల్వే ఆర్‌పిఎఫ్ డిజిటల్ సెక్యూరిటీ కమిషనర్ ఆకాష్‌కుమార్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం తిరుపతి రైల్వేస్టేషన్‌కు విచ్చేశారు. శ్రీవారి దర్శనం చేసుకుని, ఆర్‌పిఎఫ్ కార్యకలాపాలను తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం రైల్వేకోచ్‌లో జరిగిన అగ్ని ప్రమాదం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఆఫ్ ఆర్‌పిఎఫ్ రాజగోపాల్‌రెడ్డి, సందీప్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుమానం పెనుభూతమై...

భార్యను చంపి భర్త ఆత్మహత్య
అనాథలైన ఇద్దరు చిన్నారులు
సంఘటనా స్థలాన్ని ఎఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తాళి కట్టినవాడు నూరేళ్లు వెంట ఉంటాడని నమ్మింది. తన 15 ఏళ్ల వివాహ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న ఆ మహిళ, ఆ సవాళ్లను ఎదురీదుతూ పిల్లల కోసం కష్టపడి ఉద్యోగం చేసి ప్రయోజకులను చేయాలని, భర్త పెట్టే వేధింపులను ఓవైపు భరిస్తూ, మరోవైపు కుటుంబ బాధ్యతను భుజానేసుకుంది. ఇటీవల భర్తతో విడిపోయి పుట్టింటినుంచే తెల్లవారుజామున అమరరాజా బ్యాటరీస్ లో విధులకు హాజరు కావడానికి బయలుదేరింది. భార్యపై ఎంతోకాలంగా అనుమానం ఉన్న ఉన్మాది ఆ ప్రాంతంలోనే మాటువేసి ఒక్కసారిగా కత్తితో దాడి చేస్తూ గొంతు కోసేసాడు. ఈ ఘటనతో శనివారం తెల్లవారి ఒక్కసారిగా మంగళంలో అలజడి మొదలైంది. మతురాలు ఉష తండ్రి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు...

15 ఏళ్ల క్రితం ఎం.లోకేశ్వర్ (45) అనే వ్యక్తికి తన కుమార్తె టీఎస్.ఉష (34)ను ఇచ్చి వివాహం చేసామన్నారు. వీరికి కొడుకు బద్రి, కుమార్తె పండు పుట్టారు. కొన్నేళ్లుగా మద్యం తాగి అకారణంగా ఉషను దూషించడం, కొట్టడం చేసేవాడు. గొడవ జరిగిన ప్రతిసారీ ఉష పుట్టింటికి వచ్చి హింసిస్తున్నాడని, కాపురానికి వెళ్లనని భీష్మించుకుంటున్నా, నచ్చజెప్పి పంపించేవాళ్లం. వీరి కాపురం బాగుండాలని తిరుమల నగర్ లో ఓ ఇల్లును అద్దెకు తీయించి అక్కడ ఉంచాము. ఈ క్రమంలో గత నెల 29వ తేదీ మరల ఉషపై దాడి చేయడంతో మేము కాపురం ఉంటున్న కోళ్ల ఫారాలలోని మా ఇంటికి వచ్చింది. ఆ రోజు నుండి మా ఇంటి వద్ద ఉంటూ అమర రాజా బ్యాటరీస్ లో ఉద్యోగానికి వెళ్లి వచ్చేది. ఇతను మారడు అని తన కుమార్తె విడాకుల కోసం కోర్టులో కేసు వేసింది. ఈనెల 24వ తేదీ తుది తీర్పు వెలువడనున్న నేపథ్యంలో ఈ ఘాతుకానికి దుర్మార్గుడు పాల్పడ్డాడు అంటూ ఉష తండ్రి శ్రీనివాసులు బోరున విలపించాడు. తన కుమార్తెను చంపేశారని తెలిసిన తల్లి విజయ, కుమారుడు సాయి ప్రకాష్, ఉష తోబుట్టువులు, బంధువులు పెద్ద సంఖ్యలో

దంపతుల ఫైల్‌ఫొటో

ఘటనా స్థలానికి చేరుకొని ఉష మతదేహాన్ని చూసి బోరున విలపించారు. లోకేశ్వర్ ను దూషించి శాపనార్థాలు పెట్టారు. సంఘటన స్థలాన్ని ఏఎస్పి రవిమనోహరాచారి, తిరుచానూరు పోలీస్ స్టేషన్ సీఐ సునీల్ కుమార్, మంగళం క్లస్టర్ బాధ్యులు జగన్నాథరెడ్డి పరిశీలించి మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రూయా ఆసుపత్రికి తరలించారు.

మాటువేసి హత్య చేసి ఆపై తాను ఆత్మహత్య...

తన భార్య ఉషపై అనుమానం పెంచుకున్న భర్త లోకేశ్వర్ తాను మారానని, ఇకపై బుద్ధిగా ఉంటానంటూ నమ్మబలుకుతూనే పక్కా ప్రణాళిక ప్రకారం తిరుమల నగర్ గ్రామపంచాయతీ కోళ్ల ఫారాలలో ఉష తన పుట్టింటి నుండి అమర రాజా బ్యాటరీ సంస్థలు విధులకు తెల్లవారుజామున నాలుగున్నర గంటల ప్రాంతంలో బయలుదేరింది. ఉష ప్రధాన మార్గంలోకి రావడం గమనించిన లోకేశ్వర్ తన వెంట తెచ్చుకున్న కత్తులతో ఉష గొంతుపై తీవ్ర గాయం చేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావమై ఉష అక్కడికక్కడే కుప్ప కూలిపోయింది. వెంటనే లోకేశ్వర్ తిరుమల నగర్ లో అద్దెకు ఉంటున్న 380 నెంబర్ ఇంటికి ఆగ మేఘాలపై చేరుకున్నాడు. ఏమి జరిగిందో ఏమో కానీ తాను కూడా ఇంటిలో ఉరివేసుకొని చనిపోయాడు.

అమ్మానాన్న ఇద్దరూ చనిపోవడంతో....

తల్లి ఉషని చంపి తండ్రి లోకేశ్వర్ కూడా ఆత్మహత్య చేసుకోవడంతో వారి పిల్లలు బద్రి, పండు అనాథలయ్యారు. బద్రి 9వ తరగతి చదువుతున్నాడు

అమర హాస్పిటల్‌లో అరుదైన చికిత్స

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి అమరా హాస్పిటల్‌లో 49 ఏళ్ల మహిళ లక్ష్మీదేవికి మిడిల్ ఆరోటిక్ సిండ్రోమ్‌కు, కవర్డ్ సిపి స్టంట్ పద్ధతిలో అత్యాధునిక చికిత్స అందించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఈ మహిళను గత నాలుగేళ్లుగా నియంత్రణలో లేని రక్తపోటు (బీపీ), అలసట, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు వేధించాయి. పునరావృతంగా ఆమె పలుమార్లు ఊపిరితిత్తుల ఎడమ (పల్మనరీ ఎడిమా) సమస్యతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. పరీక్షల్లో, ఆమె అరోట, కుడి కామన్ లియాక్ ఆరెట్రీలో తీవ్రమైన అడ్డం ఉన్నట్లు గుర్తించారు. ఆమెకు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, అరోట తీవ్రంగా కాల్షియం చేరిన స్థితిలో ఉందని డాక్టర్లు తెలిపారు. ఈ స్థితిలో కవర్డ్ సిపి స్టంట్ విధానాన్ని ఉపయోగించి వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఈ చికిత్స విజయవంతమవడంతో పేషెంట్ రక్తపోటు స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతం చేసిన వైద్యులకు, సిబ్బందికి అమర యాజమాన్యం అభినందనలు తెలిపారు.

కననంబేడు దళితులకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బిఎన్ కండ్రిగ మండలం సిపిఐ మండల మహాసభ కత్తి ధర్మయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ధ్వజమెత్తారు. బి ఎన్ కండ్రిగ మండలం కననంబేడు దళితుల భూమికి తక్షణమే ఎమ్మార్వో స్పందించి ఇంటి పట్టాలు మంజూరు చేయకపోతే ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి.రమణయ్య, సుబ్రమణ్యం, షణ్ముగం, గోవిందయ్య, రాఘవయ్య, చంద్రమ్మ, గుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

31వ రోజూ కొనసాగిన నిరసన దీక్ష

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: నిబంధనలకు విరుద్ధంగా గత పది సంవత్సరముల నుండి వెంకటగిరిలోనే తిష్ట వేసి ఉన్న శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావుని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 31వ రోజుకి చేరాయి. ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె ఏడవ రోజుకి చేరింది. ఈ సందర్భంగా శిబిరాన్ని ఉద్దేశించి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచే వరకు పోరాటం ఆగదని అన్నారు. పారిశుద్ధ్య విభాగం నుండి రామారావును తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య, ప్రసాద్ సుబ్రహ్మణ్యం శేఖర్ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె ఆగదు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా, గూడూరులో ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అనుబంధం ఆధర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మె శనివారానికి ఏడవ రోజుకు చేరుకుంది. అదే బాటలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె నాలుగవ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించి ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల వారి డిమాండ్లకు వెంటనే పరిష్కారం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దారా కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, భూలోకం మురళి, బి.రమేష్, గూడూరు మని, చంగనపల్లి మహేష్, కె.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు కమిషనర్ మంజునాథ గౌడ్‌కు వినతి పత్రం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలపై సమ్మె చేస్తున్నారన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్య క్రమంలో సిఐటియు నాయకులు ఏ.విజయ్, కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, రామలింగం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వాగును తలపిస్తున్న రోడ్లు



ప్రజాశక్తి ఏర్పేడు : కొద్దిపాటి వర్షం వస్తే చాలు రోడ్లు చెరువుల్లా మారుతున్నాయి. ఈ దుస్థితి ఏర్పేడు మండలం, బండారుపల్లిలో రైస్ మిల్లు వీధి, కడ వీధిల్లో నెలకొంది. పేరుకే పెద్ద పంచాయతీ సమస్య వస్తే గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం. గతంలో ఎంపీ నిధులతో రైస్ మిల్లు వీధి, కడ వీధిల్లో డ్రైనేజీ కాల్వను ఏర్పాటు చేశారు. కానీ నిధులు పక్కదారి పట్టడంతో పరిస్థితి మొదటికి వచ్చింది. ఈ సమస్యను పలుమార్లు గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్పటికీ పరిష్కారం కాలేదని గ్రామస్తులు వాపోతున్నారు. వీధుల్లో పారిశుద్ధ్యం స్తంభించడంతో, దోమలు వృద్ధి చెంది కాలనీ వాసులు జ్వరాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చంద్రశేఖర్ రెడ్డికి డాక్టరేట్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధి, తిప్పవరప్పాడుకు చెందిన మేడిచర్ల చంద్రశేఖర్ రెడ్డికి యాన్ ఎన్హాన్సెడ్ ఆర్.పి.ఎల్. రౌటింగ్ ప్రోటోకాల్ డిఫెండింగ్ వార్మ్ హెూల్ అటాక్స్ ఇన్ ఐ అండ్ టి అనే అంశంపై కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధన చేసి పరిశోధన గ్రంథం సమర్పించినందుకు రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు శ్రీనివాసులు, సురేష్ బాబు, విశ్వనాధ్ రెడ్డి తదితరులు ఆయనను అభినందించారు.

మినర్వా స్కూలులో విద్యార్థి సంఘ ఎన్నికలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, మినర్వా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలలో ఎస్పీఎల్‌గా అంకుర్, లక్ష్మీ శ్రుతి, ప్రదీప్త, ఏఎస్పీఎల్‌గా కౌషిక్, సాయి అనుత్తమ ఎంపికయ్యారు. స్పోర్ట్స్ విభాగంలో కెప్టెన్లుగా సుబ్బారావు, రుచిత, కీర్తి, వైస్ కెప్టెన్లుగా కీర్తి వర్ధన్, గ్రీష్మిత ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి ఎలక్టోరల్ ఆఫీసర్లుగా ఉపాధ్యాయులు శ్రీనివాసులు, గిరీష్ కుమార్‌లు వ్యవహరించారు. స్కూలు డైరెక్టర్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రాంప్రసాద్ ఎన్నికలలో గెలిచిన విద్యార్థులను అభినందించారు.

'ఆకలి కేకలు' పోరాటానికి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ మద్దతు

ప్రజాశక్తి - క్యాంపస్ : విజయవాడలో స్థానిక లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఐఏఎస్ ఎస్.విజయ్ కుమార్ బీసీ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు పోస్టర్స్‌ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం చేస్తున్న పోరాటానికి పూర్తి మద్దతు తెలియజేస్తున్నానని వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ బీసీ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రోజుకు 150 రూపాయలు, కాస్మోటిక్ చార్జీలు 500 రూపాయలు పెంచాలని, బీసీ హాస్టల్‌కు శాశ్వత భవనాలు, బిసి హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం తీసుకున్న నిర్ణయంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కూడా భాగస్వామ్యం అయి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు, రాయలసీమ అధ్యక్షులు విజయ ఉత్తరాది, చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఓ.వెంకట్ యాదవ్, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ అధ్యక్షులు డా. ఏబ్రా, వర్సిటీ విద్యా సంఘం నాయకులు శివాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

స్వయం కోర్సు రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో పీజీ విద్యార్థులపై అధికారులు బలవంతంగా అమలు చేస్తున్న స్వయం ఆన్లైన్ కోర్సులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్రకాశం భవనం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ విషయమై 22వ తేదీన వందలాదిమంది విద్యార్థులతో పరిపాలన భవనాన్ని ముట్టడిస్తున్నామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో-కన్వీనర్ అశోక్ కుమార్, యూనివర్సిటీ కార్యదర్శి వినోద్‌లు తెలిపారు. వారు మాట్లాడుతూ స్వయం కోర్సుల ముసుగులో కేంద్ర ప్రభుత్వం, విశ్వవిద్యాలయ అధికారులు విద్యార్థులపై అధిక భారాన్ని మోపుతున్నారని, తరగతిగది విద్యను పక్కన పెట్టి ఆన్లైన్ బోధన పేరుతో విద్యను వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే స్వయం కోర్సుని రద్దు చేసి, మునుపటిలాగా ఇతర విభాగాల్లో ఒక సబ్జెక్టుని ఓపెన్ ఎలక్టివ్ పేపర్‌గా ఎంచుకునే అవకాశం కల్పించాలని కోరారు. లేని యెడల రానున్న కాలంలో అఖిల పక్ష విద్యార్థి సంఘాలతో కలిసి తరగతులు బహిష్కరించి యూనివర్సిటీ బంద్‌కి పిలుపునిస్తామని హెచ్చరించారు. పీజీ సెట్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, మల్లి కార్జున, చక్రి, అనిల్ పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యంతో కూడిన పోరాటం

మతోన్మాదుల ఆగడాలను అరికట్టాలి : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటి : కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు రాజకీయ చైతన్యంతో కూడిన పోరాటాలు సాగించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇటు రాష్ట్రంలో అటు దేశవ్యాప్తంగా రోజురోజుకీ మతోన్మాదుల ఆగడాలు పెచ్చు మీరుతున్నాయన్నారు. సిపిఐ తిరుపతి నగర 14 వ మహాసభలలో భాగంగా రెండవ రోజు ప్రతినిధుల సభ తిరుపతి గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో రాధాకృష్ణ, ఎన్ డి రవి, శివ, మంజుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ మతోన్మాదులు పుస్తకశాలలపై దాడులు చేయడం దారుణమన్నారు. యోగ కార్యక్రమానికి కోట్ల రూపాయలు ఖర్చు చేశారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. చంద్రబాబు హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాలలో స్వచ్ఛందంగా పనిచేసే విధంగా సైద్ధాంతికంగా ఎదగాలన్నారు. ఈ మహాసభలో జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, ఉదయ్ కుమార్, నదియా, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో విద్యా వ్యవస్థ పోటీ పడాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక బైరాగపట్టెడ ఆర్చ్ వద్ద వీక్ష ది స్కూల్ లో శనివారం ఎనర్జీ, ఫాస్ట్ వేదిక్ శాటిలైట్, పాస్ట్ వేదిక్ రోబోటిక్ అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రియ యోగ ట్రైనర్ శివాజీ మాట్లాడుతూ జర్మనీలో వివిధ అంశాలపై (పీహెచ్డీ ఇన్ ఎనర్జీ, ఫాస్ట్ వేదిక్ శాటిలైట్ ఫాస్ట్ వేదిక్ రోబోటిక్స్) డాక్టరేట్లు అందుకొని ఎనర్జీ సైంటిస్ట్ జర్మనీ సాయిరాం ఇప్పుడు మన సంస్థకు రావడం సంతోషకరమన్నారు. సంస్థ డైరెక్టర్ ఆర్కే విమల మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఆర్కే ఇన్స్టిట్యూషన్ సంస్థ చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ రోజులలో టెక్నాలజీతో పోటీపడే విధంగా విద్యావ్యవస్థ ఉండాలని, టెక్నాలజీలో ముందంజలో ఉండేందుకు ఎనర్జీ అనే అంశం పిల్లలకు ఉపయోగ పడుతుందని రోబోటెక్స్, ఫాస్ట్ వేదిక శాటిలైట్, వంటి అంశాలను సాయిరాం వివరించారని తెలిపారు. అనంతరం సైంటిస్ట్ సాయిరాంని సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలో వివిధ ఆరోగ్య సమస్యల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న బాధితులకు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి విడుదలైన చెక్కులును అందచేశారు. సూరిబాబు కు రు. 87, 226/-, ఏకాంబర కుప్పంకు చెందిన ఇందుకు రు.37,288 /-, మీనా కి రు.25,524/-, గౌరీకి రు.54,649/-, శ్యామల కు రు. 28,400/-, సత్రవాడకు చెందిన ఆర్ముగంకు రు. 80,260/-, పుదుపేటకు చెందిన అయ్యప్పన్‌కు రు.30,000/-, శివగామికి రు.71,676/-, ఉమాకు రు.1,58,939/-, జ్ఞానశేఖర్‌కు రు.2,48,960/-, నగరి రూరల్ మండలం, తడుకుపేటకు చెందిన రమాదేవికి రు.1,62,000/-, మునికన్నయ్య నాయుడుకు రు.1,14,574/-, దీనదయాల్‌కు రు.25,000/-, పుత్తూరు రూరల్ మండలం, పరమేశ్వర మంగళంకు చెందిన జయశేఖర్‌కు రు.79,212, వడమాలపేట మండలం ఎల్.ఎం కండ్రిగకు చెందిన ధనభాగ్యమ్మకు రు. 2,37,319/-, ఎస్‌బిఆర్ పురం గ్రామానికి చెందిన శ్రీనివాస రాజుకు రు.32,178/-లు మొత్తం 16 మందికి రు.14,73,205 /-లు పంపిణీ చేశారు.

పారిశుద్ధ్యం, తాగు నీటి సరఫరాపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - తొట్టంబేడు: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఉన్నం నిర్మల వాసుదేవ నాయుడు అధ్యక్షతన శనివారం మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయేది వర్షాకాలమని పంచాయతీలో ఉన్న ప్రతి ఒక్క కార్యదర్శి పారిశుద్ధ్యం, తాగునీరు సరఫరాలపై దృష్టి పెట్టాలన్నారు. మండలంలో రెండు వైద్యశాలలు ఉన్నాయని ఇవి 24 గంటలు పనిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో మాట్లాడుతూ గ్రామాల్లో నివసించే ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండలం ఎంపీడీవో సురేంద్రనాథ్, ఉమ్మడి జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి వాసుదేవ నాయుడు, వైస్ ఎంపీపీ మల్లికమ్మ, గేరటారెడ్డి, కో ఆప్షన్ నెంబర్ ప్రేమ్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడాలి

నారాయణ స్కూల్‌లో ప్రజా ప్రతినిధుల ఎన్నిక కార్యక్రమం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పిల్లల్లో విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవడాలని నారాయణ ఇంగ్లీష్ మీడియం టెక్నో స్కూల్ ఏజీఎం శ్రీనివాసులు సూచించారు. స్థానిక నారాయణ స్కూల్‌లో శనివారం ప్రజా ప్రతినిధుల ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని హౌస్, నాగ్ హౌస్, పృధ్వి హౌస్, త్రిషఉల్ హౌస్ విభాగాల్లో హెడ్ బాయ్, హెడ్ గర్ల్ నాయకులను ఎన్నుకున్నారు. వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

తూ తూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండలంలోని సచివాలయం సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని పుత్తూరు ఎంపీపీ మునివేలమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ఎంపీపీ మునివేలమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధులకు సరిగా రాని సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. బదిలీల నేపథ్యంలో వారు విధులకు సరిగా రావటం లేదని ఇన్చార్జి ఎంపీడీవో వాణి సమాధానమిచ్చారు. సర్పంచులు మురళీమోహన్, వెంకటేష్ బొబ్బిలి యాదవ్‌లు మాట్లాడుతూ పంచాయతీల్లో నిధులు లేవని, వర్షాకాలం కాబట్టి పారిశుద్ధ్యం కార్యక్రమాలు తాగునీటి సమస్య సైతం సొంత నిధులతో చేపట్టాల్సి వస్తోందని ఆరోపించారు. గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు త్వరలోనే వస్తాయని, జిల్లా పరిషత్ నిధులు నుంచి తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలు తెలియజేస్తే నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఈఓ తిరుమల రాజు మాట్లాడుతూ పాఠశాలల విలీనంతో మంచి విద్య అందిస్తున్నట్లు తెలిపారు. అందుకు సర్పంచులు ప్రభుత్వ ఉద్యోగులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్ మంగమ్మ స్పందిస్తూ ప్రయాణికులు లేక ఆదాయం రావడం లేదని బస్సులు నడపలేక పోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మునస్వామి రెడ్డి, విమలమ్మ, సింగల్ విండో అధ్యక్షులు ఎస్ మోహన్ రాజు, కరుణ యాదవ్, వ్యవసాయ అధికారి కోదండయ్య, అర్టికల్చర్ ఏవో వెంకట సౌజన్య, ఉపాధి హామీ ఏపీఓ మమత, ఎంపిటిసీలు సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టుకు కూటమి కుట్ర: ఎంపి గురుమూర్తి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: గత సార్వత్రిక ఎన్నికల తర్వాత తర్వాత నెలకొన్న పరిస్థితుల నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తక్కువ కాలంలోనే రాజకీయంగా కోలుకొని బలమైన ప్రజాగొంతుకగా నిలిచిందని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అన్నారు. ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేస్తూ ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టించే స్థాయికి చేరిందని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌తో పాటు టీడీపీ నాయకులకు దిక్కుతోచని స్థితి ఏర్పడిందని విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కోలేక, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చే కుట్రలో భాగంగా లోక్‌సభ పక్ష నేత మిథున్‌రెడ్డిలాంటి బలమైన నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయలేరని అన్నారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు.

నేడు ఐఐటిలో 7వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని ఐఐటి తిరుపతిలో ఆదివారం 7వ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు ఐఐటి డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్, పీహెచ్డీ పూర్తి చేసిన 417 మంది విద్యార్థులకు పట్టాలు అందించనున్నారు. కాగ్నిజెంట్ కో ఫౌండర్, క్రియా యూనివర్సిటీ ఛాన్సర్ లక్ష్మీనారాయణన్, జె ఎస్ డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.

తైవాన్ విద్యార్థులు మహిళా విశ్వవిద్యాలయం సందర్శన

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇంపాక్ట్ హబ్ హైదరాబాద్, మహిళా యూనివర్సిటీ మధ్య జరిగిన పరస్పర ఒప్పందంలో భాగంగా, ఇంపాక్ట్ హబ్ హైదరాబాద్‌కి 3 నెలలు ఇంటర్న్‌షిప్ కోసం ముగ్గురు విద్యార్థులు (చుంగ్ చియా హ్సువాన్, సోషియాలజీ విభాగం (హువాంగ్ చెన్ కై, నాటక శాఖ యుయి అకియామా, విదేశీ భాషలు మరియు సాహిత్య విభాగం) నేషనల్ తైవాన్ విశ్వవిద్యాలయం (ఎన్టీయూ), తైవాన్ నుండి విచ్చేశారు. వారు తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నాలుగు రోజులు పాటు వివిధ విభాగాలు, ఇంక్యుబేషన్ సెంటర్స్‌ని సందర్శించనున్నారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.వి.ఉమ వీరికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్.ఎన్.రజని,డీన్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ప్రొఫెసర్.పి.విజయ లక్ష్మి, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్.ఆర్.ఉషా తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి- బుచ్చినాయుడుకండ్రిగ: ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు వాట్టిల్లుతోందని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే ముప్పుపై అవగాహన కల్పించారు.

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల మూడో శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ వారం 'ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు' అనే నినాదంతో బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ మురళీధర్ రెడ్డి, ఆరోగ్య అధికారి డీఎన్ వెంకటేశ్వర్లుల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించి, ప్లాస్టిక్ వాడకంతో వచ్చే ముప్పును వివరించారు.

ప్రజాశక్తి -దొరవారిసత్రం : అక్కర పాక గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణయ్య, పంచాయతీ సెక్రెటరీ మునిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్నినిర్వహించారు. కళాశాలలో మొక్కలను నాటారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేయించారు.

పురపాలక సంఘ కమిషనర్ మంజునాథ్ గౌడ్ మున్సిపల్ మార్కెట్‌ను సందర్శించి, ఒకసారి మాత్రమే వినియోగించగల ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహించారు. వాణిజ్య సముదాయాల యజమానులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను తెలిపారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, టవర్ క్లాక్ సెంటర్ వద్ద పురపాలక సంఘ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలం కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను ప్రతి ఒక్కరూ నిషేధించి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రకు సహకరించాలని సూచించారు. **ఏస్వీయూలో..**

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు క్యాంపస్లో విద్యార్థులు పరిశోధకులు అధ్యాపకులు తమ చుట్టూ ఉన్న పరిసరాలను, తరగతి గదులను, ల్యాబ్లను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన ప్రశాంతకరమైన వాతావరణాన్ని ఏర్పరచుకోవాలని వర్సిటీ ఇన్చార్జి విసి ఆచార్య అప్పారావు పేర్కొన్నారు.

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, కాలేజీలో.. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరుమల నారాయణమ్మ, డాక్టర్ భద్రమణి, కృష్ణవేణి, దివ్యవాణి, ఉమారాణి, విద్యుల్లత, సాయి కుమారి, సునీత, డాక్టర్. మల్లేశ్వరి, జయశ్రీ, వసుధ, శిరీష , భారతి, లక్ష్మి, జ్ఞాన ప్రసూన , సుధాకర్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో.. శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో కళాశాల ఆవరణలో "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ రెడ్డి, కార్యక్రమాధికారి , బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఎస్వీజేసిలో.. శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎన్. ఎస్. ఎస్. వాలంటీర్లతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

క్రైం న్యూస్

టీ మాస్టర్ల మధ్య ఘర్షణ

ఒకరిపై మరో వ్యక్తి కత్తితో దాడి

చికిత్స పొందుతున్న టీ మాస్టర్ గోపాల్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఇద్దరు టీ మాస్టర్ మధ్య రగడ చోటు చేసుకుంది, దీంతో ఒకరిపై మరొకరు కత్తితో దాడి చేసుకున్న ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు పుట్టపర్తి జిల్లా, ధర్మవరం పట్టణ చెందిన ఎం వేణుగోపాల్ (28), నేపాల్ కు చెందిన సుమన్ అనే వ్యక్తి టీ మాస్టర్లుగా పనిచేస్తున్నారు. చిన్నపాటి వివాదంతో ఇద్దరు శుక్రవారం రాత్రి గొడవకు దిగారు. గోపాల్ పై సుమన్ కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాల పాలైన వేణుని స్థానికులు రుయా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై కోతి దాడి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కోతి దాడి చేయడంతో బాలిక గాయపడ్డ ఘటన శ్రీకాళహస్తి రూరల్ మండలం, ఉడమలపాడులో శనివారం చోటు చేసుకుంది. స్థానిక గ్రామానికి చెందిన సురేంద్రబాబు, నందినిల కుమార్తె నిహిత ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా అకస్మాత్తుగా కోతి దాడి చేసి కరిచింది. దీంతో బాలికకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో కోతుల బెడద ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కూటమి మోసాలు ఇంటింటికీ తీసుకెళ్దాం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, సుపరిపాలన అంటూ ప్రజలను మోసం చేస్తుందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. శనివారం గూడూరు, సనత్ నగర్, వైసిపి కార్యాలయంలో బాబు షుర్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసాలను, అక్రమ కేసులు, భూ ఆక్రమణలను ఇంటింటికి వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, చేవూరు విజయమోహన్ రెడ్డి తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో శనివారం సత్యవేడు వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ పాల్ మాట్లాడుతూ చంద్రబాబు మోసం చేయడంలో దిట్ట అని విమర్శించారు. కూటమి వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, మునిరెడ్డి, గోపాల్ రెడ్డి, రవి రెడ్డి బాబు రెడ్డి అజిరెడ్డి, గురవయ్య, దేవదాసు రెడ్డి, ప్రసాద్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమృద్ధి స్థాపక ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవనంలో శనివారం గ్రామ సమృద్ధి స్థాపక ప్రణాళికపై జిపిడిపీలో అనుసంధానం నిమిత్తం ఒక్కరోజు శిక్ష తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మునిరాజా మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులో సీసీలు, వివోఏలు, వివో, అధ్యక్షులకు పొదుపు సంఘ సభ్యుల అవసరాలు, జీవనో ఉపాధి పెంపుదల, మొదలగు అంశాలపై గ్రూప్ సమావేశంలోనే యాప్‌లో నమోదులపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన్, సూపర్డెంట్ రఘురామయ్య, డి ఆర్ పి చంద్రబాబు, మునెయ్య సీసీలు పోలమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఛలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 21న విజయవాడలో జరిగే ర్యాలీనీ జయప్రదం చేయాలని ఏఐటియుసి అనుబంధ గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ గూడూరు డివిజన్ నాయకులు శనివారం గోగినేని పురం వద్ద ఛలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గూడూరు డివిజన్ నాయకులు మధిర బాలయ్య మాట్లాడుతూ జె.ఎల్.ఎం గ్రేడ్ 2 లకు పాత సర్వీసు రూల్స్ ప్రకారం ఏ.ఎల్.ఎం ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. నూతన వివక్ష పూరిత సర్వీస్ రూల్స్ రద్దు చేయాలన్నారు. ఏపీ ఎస్ఈబి సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలన్నారు. అక్టోబర్ 2019 నుండి సచివాలయ ఉద్యోగులకు అమలవుతున్న అన్ని రకాల సెలవులు, అలవెన్సులు జేఎల్ఎం 2 లకు అమలు చేయాలన్నారు. విద్యుత్ సంస్థలో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈనెల 21 న విజయవాడలో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జస్వంత్, శ్రీను, శివ, నరేష్, సందాని తదితరులు పాల్గొన్నారు.

కరకంబాడి మార్గంలో భారీ ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శనివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి తిరుపతి కరకంబాడి మార్గంలోని ఉపాధ్యాయ నగర్ కూడలి వద్ద భారీ ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపు గంటకు పైగా వర్షం కురవడంతో వర్షపు నీటితో పాటు మురుగునీరు రోడ్లపైకి ప్రవహించింది. వర్షం నిలవడంతో ఒక్కసారిగా నలువైపుల నుండి వాహనాలు ఒకసారి రోడ్డుపైకి రావడంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కరకంబాడి మార్గం ఉపాధ్యాయ నగర్ ప్రారంభంలో నదీ ప్రవాహాన్ని తలపించింది. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

రోజా వ్యాఖ్యలు అభ్యంతరకరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలు అభ్యంతరకరమని చరిత్ర మరవరాదని శనివారం పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గాలి భాను ప్రకాష్ నగరిలో 45 వేల రికార్డు మెజారిటీతో గెలిచారన్నారు. ఇటీవల ఇసుక అక్రమ రవాణాలో పట్టుబడిన టిప్పర్లు వైసీపీకి చెందిన కౌన్సిలర్లవే అని ఆరోపించారు. రోజా కూటమి నాయకులపై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

అభివృద్ధి చెందింది రోజా కుటుంబ సభ్యులే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ మంత్రి రోజా హాయంలో నగరి నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని, అభివృద్ధి చెందింది ఒక్క రోజా కుటుంబ సభ్యులే అని వడమాలపేట జడ్పిటిసి సభ్యులు మురళీధర్ రెడ్డి ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరి నియోజకవర్గంలో గడిచిన రెండు రోజులుగా మాజీ మంత్రి రోజా స్థానిక ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పై ఆరోపణలు చేస్తున్నారని, వాస్తవానికి మాజీ మంత్రి రోజా హాయంలో డబ్బులు ఇస్తే ఎలాంటి పనైనా చేసి పెట్టే వారిని ఎద్దేవా చేశారు. రోజా హాయంలో నగిరి నియోజకవర్గంలో భూ కబ్జాలు, గంజాయి, గ్రావెల్ మాఫియా, ఇసుక మాఫియాలను పెంచి పోషించారని, నేడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వాటిని కట్టడి చేస్తుందన్నారు. పాదిరేడు అరణ్యం భూములు తీసుకున్న టిటిడి నష్టపోయిందని, ఇటు భూములు ఇచ్చిన మేము కూడా నష్టపోయామని అన్నారు. వాగులు గుంతలు ఉన్న భూములకు తుడా అప్రూవల్ పొందలేక, దాదాపు 450 ఎకరాలకుపైగా భూమి కొని టిటిడి నష్టపోయిందన్నారు. అంజేరమ్మ కణం వద్ద భూదానం భూమిలో వెంచర్ వేశారని దీనిపై సమగ్ర విచారణను వేయాలని, అలానే టీటీడీలో వైసిపి హాయంలో రోజా శ్రీవారి దర్శనం టికెట్లు పొందిన తీరుపై కూడా విచారణ జరపాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ భాస్కర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, మునీంద్ర, సుబ్రమణ్యం, సోము తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడాల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యువత చదువుతోపాటు, క్రీడల్లోనూ రాణించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల గ్రౌండ్ శనివారం ఆయన యూత్ వాలీ బాల్ టోర్నీని ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కాసేపు సరదాగా వాలీబాల్ ఆడారు. వాలీ బాల్ పోటీల్లో యువత గొప్పగా రాణించి జాతీయ జట్టుకు ఆడాలని ఆయన ఆకాంక్షించారు. టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటకం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుపతి, యస్వీయు శ్రీనివాస ఆడిటోరియంలో శనివారం సాయంత్రం నిర్వహించిన నాటక ప్రదర్శన కార్యక్రమంలో 'బుద్ధునితో నా ప్రయాణం – డా॥ అంబేద్కర్' నాటకం ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేసింది. నటీనటులు అద్భుతంగా నటించి పాత్రలకు ప్రాణం పోశారు. భారత దేశంలో ఆవిర్భంవించి విశ్వవాస్తి చెందిన బౌద్ధ ధర్మం గురించి నాటక రచయిత చక్కగా వివరించారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి, హైదరాబాద్ వారిచే తిరుపతి శ్రీ చల్లప్ప మేస్త్రి మెమోరియల్ అంబేద్కర్ కమిటి, తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటి, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం, తిరుపతి జిల్లా బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో నిర్వహించబడిన ఈ నాటకం ప్రేక్షకుల మన్ననలు పొందింది.

సాయి సత్సంగ నిలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఉపపీఠంలో పంచామృత, సుగంధ ద్రవ్య పూర్వక నువ్వుల నూనె తైలంతో శ్రీ భవానీ శంకర స్వామి వారి మృత్తికా శివలింగానికి మరియు శనైశ్చర భగవానుని యొక్క మూర్తికి విశేష రీతిలో అనులోమ విలోమ ప్రక్రియలో మూలమంత్రాలను చదువుతూ మన్యుసూక్త విధానంతో మన్య సూక్తం లోని ప్రతి సూక్తానికి రుద్రం లోని సుక్తాలతో సంపుటికరణ చేస్తూ విశేష అభిషేకము తదుపరి హోమం నిర్వహించారు. అనంతరం పుష్పార్చన నిర్వహించడం జరుగుతుంది. జాతకంలో శని దశలో ఉన్నవారికి, ఏలినాటి శని, అర్ధాష్టమ శని, అష్టమ శని కారణంగా ఇబ్బంది పడుతున్న వారికి శ్రీ శనైశ్చర భగవానుని యొక్క అనుగ్రహంతో సకల దోషాలు తొలగి సంతోషంగా ఉంటారు.

ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శనివారం శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఉత్సవ రోజుల్లో ఉదయం 6 నుండి 6.30 గంటల వరకు శ్రీ ఆండాళ్ అమ్మవారికి తిరుమంజనం, సాయంత్రం 5.30 నుండి రాత్రి 7 గంటల వరకు అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. జూలై 28న శ్రీ ఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు శ్రీ గోవిందరాజస్వామివారు, శ్రీ ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు శ్రీ గోవిందరాజ స్వామి వారు, శ్రీ ఆండాళ్ అమ్మవారిని అలిపిరికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఆస్థానం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజల అనంతరం అలిపిరి నుండి రామనగర్ క్వార్టర్స లోని గీతా మందిరం, ఆర్ఎస్ మాడ వీధిమీదుగా ఊరేగింపు ఆలయానికి చేరుకుంటుంది.

ఆగస్టు 13న గంధ మహోత్సవం

గంధ మహోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా వారి గంధమహోత్సవ కరపత్రాలను శనివారం దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ చేతుల మీదుగా దర్గా ఆవరణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మొహరం మాసం తర్వాత వచ్చే సఫర్ నెల చంద్రోదయం చూసిన వెంటనే హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా వారి దర్గాలో నిషాన్ జెండా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 26వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు నిషాన్ కార్యక్రమం జరుగుతుందని, ఆగస్టు 13న గంధమహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ రియాజ్ అహ్మద్, మత గురువులు మగ్దూమ్ అలీషా, గౌస్ మస్థాన్ ఖాదరి, కమిటీ ప్రతినిధులు షానవాజ్, తదితరులు పాల్గొన్నారు.

శిరసనం బేడులో పంట నమోదు

ప్రజాశక్తి - పెళ్లకూరు : పెళ్లకూరు మండలం, శిరసనం బేడులో శనివారం వ్యవసాయ సంచాలకులు నాగార్జున సాగర్ ఆధ్వర్యంలో పంట నమోదు కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారులు రైతులతో కలిసి పంట పొలాల్లోకి వెళ్లి పంటలను పరిశీలించి పంట దిగుబడి, వరి పైరుకు వచ్చే తెగుళ్లు వాటి నివారణకు సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా నాగార్జున సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఇస్తున్న సబ్సిడీలు, బీమా, రుణాలు వంటి ఇతర పథకాలు పొందేందుకు రైతులు పంట నమోదు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏవో విజయభారతి, ఏవివిలు, రైతులు పాల్గొన్నారు.

ఫ్లోరింగ్ టైల్స్ వితరణ

టైల్స్ దాతను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు తూర్పు వీధిలోని సరస్వతి శిశు మందిరం అదనపు గదులకు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రొటేరియన్స్ సేగు శ్రీనివాసులు, బండి ధనుంజయ రెడ్డి, నెలబల్లి సిద్ధారెడ్డిల దాతృత్వంతో 25 వేల రూపాయలు విలువచేసే ఫ్లోరింగ్ టైల్స్‌ను అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. నూతనంగా రోటరీ వెస్ట్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టిన విజయ భాస్కర్ రెడ్డిని, రాఘవరెడ్డిని, ప్రముఖ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహనరావు, పాఠశాల అధ్యక్షులు మురళి రెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్స్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి, వాసు గౌడ్, సనత్ కుమార్ రెడ్డి, నాసిన నాగులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తని మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రమణ్యంలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పుత్తేరి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్టీయూ మండల శాఖ వారి ఆధ్వర్యంలో శిరీష స్కానింగ్ సెంటర్ వారి సౌజన్యంతో డాక్టర్ శివ కేశవ్, శిరీషల కుమారుడు యశ్వంత్ మౌర్య పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పలక, పెన్సిల్ విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు శిరీష స్కానింగ్ సెంటర్ వారు, శిరీష, ఎస్టీయూ నాయకులు రామచంద్రయ్య, గజేంద్ర కుమార్, బాలాజి, బాల సుబ్రహ్మణ్యం, గ్రామ సర్పంచ్ రామమూర్తి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - కేవీబీ పురం: కేవిబి పురం మండలం, ఆదవరంలో శనివారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రగతి సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గిరీష్, ఫీల్డ్ కోఆర్డినేటర్ ప్రభాకర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు గుణశేఖర్ కుమార్ రత్నం, ఏపిసిఎన్ఎఫ్ సిబ్బంది రేణుక విచ్చేశారు. ఈ సందర్భంగా గిరీష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాన్ని రైతులు చూడొచ్చన్నారు. కోఆర్డినేటర్ ప్రభాకర్ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమంలో లక్ష్మీ కుబేర కలశాభిషేకం

ప్రజాశక్తి - రామచంద్రాపురం : ప్రపంచ శాంతి, లోకకళ్యాణార్థం, మతసామరస్యానికి, యజ్ఞయాగాది క్రతువులు నిర్వహిస్తున్నామని మహారాష్ట్రకు చెందిన జగద్గురు స్వామి శాంతి గిరిజనా ప్రభువు అన్నారు. మండలంలోని సి రామాపురం సమీపంలో ఉన్న శ్రీ బ్రహ్మశ్రీ ఆశ్రమంలో శ్రీ లక్ష్మీ కుబేర హెూమ కార్యక్రమంలో భాగంగా కలిషో స్తవ కార్యక్రమం నిర్వహించారు. గణపతి పూజ, నవగ్రహ పూజ, పుణ్యాహవచన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తే ముక్తికి మార్గమని అనేక రకాల ఒత్తిళ్లకు, అనారోగ్య సమస్యలకు ఆధ్యాత్మికత, ధ్యానం, యోగా వంటివి చక్కని పరిష్కారమన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోసం ఆశ్రమంలో ఈ 22వ తేదీ వరకుశ్రీ లక్ష్మీ కుబేర హెూమం. నిర్వహిస్తున్నామన్నారు. లక్ష్మి కుబేర హోమం కోసం 108 కలిశాలతో యాగశాలలో కలిశాభిషేకం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం జగద్గురు స్వామి శాంతి గిరిజనా ప్రభువు భక్తులకు భక్తి సందేశాలను అందజేశారు. అనంతరం జగద్గురు స్వామి శాంతి గిరిజనా ప్రభువును పీఠంపై కూర్చోబెట్టి ఊరేగింపు నిర్వహించి, భక్తులు ప్రత్యేక పూజల చేపట్టి భక్తి భావాన్ని చాటుకున్నారు. అనంతరంం భక్తులందరూ శోభాయాత్రగ్గా తిరుమలకు చేరుకుని శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లు స్వామీజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -ఏర్పేడు : శ్రీకాళహస్తి భక్త కన్నప్ప కంటి ఆసుపత్రి వైద్య బృందం ఏర్పేడు మండలం, బండారుపల్లిలో శనివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో దొర కుమార్ కోఆర్డినేటర్, కన్వీనర్ గుండ్ల కాటయ్య, విహెచ్ఎస్ సభ్యులు నాదముని, లాయర్ మహేశ్వరి, బత్తిరెడ్డి, బత్తి శెట్టి పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో 15 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పయ్యావుల మురళి నాయుడు సహాయ సహకారాలతో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ టిబి వ్యాధిగ్రస్తులు కిట్లను సద్వినియోగపరుచుకోవాలని ఆరు నెలలపాటు మెడిసిన్స్, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వారికి మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డాక్టర్ లక్ష్మీనారాయణ, సూపర్వైజర్ సురేందర్ రెడ్డి , టీబీ అర్బన్ టిబిహెచ్ వి ప్రియాంక, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హరికథా గానం

ప్రజాశక్తి - రామచంద్రపురం : రామచంద్రాపురంమండలం, సిరామాపురం నిర్వహిస్తున్న మహా భారత ఉత్సవాలలో శనివారం అనసూయ భాగవతారిణి ఆలాపించిన ద్రౌపతి మానసంరక్షణ హరికథ గానం వీక్షకులను కంటతడి పెట్టించింది. స్వర్గీయ బి.యన్.రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రామినేని ప్రియాంక, బి ఎన్ నవీన్ కుమార్ రెడ్డి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అర్చకులు పోతురాజు ఉత్సవమూర్తిని చుట్టుగుంట వద్దకు తీసుకొని వెళ్లి పవిత్ర జలాన్ని సేకరించి ద్రౌపతి, శ్రీకృష్ణ, పాండవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాటర్ బాటిల్స్ వితరణ

ప్రజాశక్తి - రేణిగుంట : బిసి హాస్టల్లో నివాసం ఉంటున్న 52 మంది విద్యార్థులకు శనివారం తిరుపతి స్విమ్స్ వైద్యులు డాక్టర్ శ్రీ వింధ్య పల్లా తన నిధులతో వాటర్ బాటిల్స్ వితరణగా పంపిణీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాలు పేద విద్యార్థుల అభివృద్ధికి ఏర్పాటు చేశారని, వాటిలో ప్రవేశం పొంది బాగా చదివి ఉన్నంతంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి పల్లా వేంకటేశ్వర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎస్ఆర్ఎస్ హైస్కూల్లో పదవ తరగత చదువుతున్న విద్యార్థులకు శనివారం కురెళ్ళ సతీష్ బాబు కుమారుడు సునీల్, అల్లుడు రోహిత్, సుమారు రూ.10,000 విలువచేసే నోట్ పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సునీత మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలు, ప్యాడ్స్ ఇవ్వడం ప్రోత్సాహకరంగా ఉందన్నారు.